క్లుప్తంగా

చలో అసెంబ్లీని జయప్రదం చేయాలి



ఫిరంగిపురం: మండల కేంద్రంలో అగ్రీ గోల్డ్ కస్టమర్స్, ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి కేతినేని అగస్టీన్ మాట్లాడుతూ అగ్రీ గోల్డ్ బాధితులకు ప్రభుత్వం న్యాయం చేయాలని కోరుతూ మార్చి 5 నుంచి విజయవాడ కేంద్రంగా ఐదు రోజులు రిలే నిరాహార దీక్షలు కొనసాగుతాయని చెప్పారు. చివరి రోజున చలో అసెంబ్లీ కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. దీనిని ప్రజలు జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు షేక్. కరిముల్లా, అగ్రి గోల్డ్ ఏజెంట్లు పాల్గొన్నారు.

క్రికెట్ కిట్ అందజేత



తాడేపల్లిరూరల్ : పల్లెటూరి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం తాడేపల్లి ప్రెస్ క్లబ్ నందు క్రీడాకారులకు క్రికెట్ కిట్‌ను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ మెడికల్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు విచ్చేసి క్రీడాకారులకు క్రికెట్ కిట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల వల్ల ఆరోగ్యంతో పాటు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంటారని అన్నారు. ట్రస్ట్ చైర్మన్ జొన్న రాజేష్ మాట్లాడుతూ గత నెలలో ఉండవల్లి దేవుడు మాన్యం గ్రౌండ్స్ నందు నిర్వహించిన క్రికెట్ లీగ్ పోటీల సమయంలో క్రీడాకారులు తమకు క్రికెట్ కిట్ కావాలని కోరారని ఈ మేరకు క్రికెట్ కిట్‌ను అందజేశామని తెలిపారు. అనంతరం ఏపీ ఎంఎస్ ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావును ట్రస్ట్ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. అంబటి తిరుపతిరావు, సామల నాగేశ్వరరావు, బడే కోమలి, అవినాష్, పర్వతం మధు, దినేస్ చక్రవర్తి పాల్గొన్నారు.

కార్మెల్ మాతకు భక్తుల మొక్కులు



ఫిరంగిపురం: మండల కేంద్రంలోని కార్మెల్ కొండపైనున్న కార్మెల్ మాతను దర్శించుకునేందుకు పలు ప్రాంతాల నుంచి భక్తులు ఆదివారం తరలివచ్చారు. కదిరి, ధర్మవరం, ఆళ్లగడ్డ, కర్నూలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు కొండను ఎక్కి తల నీలాలు సమర్పించారు. కార్మెల్ మాతను దర్శించుకొని కొబ్బరి కాయలు కొట్టి, కొవ్వొత్తులు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు.

1,100 గ్రాముల గంజాయి స్వాధీనం

ముగ్గురికి రిమాండ్

దుగ్గిరాల: పెదపాలెంలో దుగ్గిరాల పోలీసులు 1,100 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అందిన సమాచారంతో దుగ్గిరాల ఎస్ఐ ఎస్.వెంకట రవి, సిబ్బందితో శనివారం సాయంత్రం పెదపాలెం గ్రామంలో తనిఖీ చేశారు. అక్కడ ఒక హెయిర్ కటింగ్ సెలూన్‌లో ముగ్గురు యువకులను గుర్తించారు. తనిఖీ చేయగా, వారి దగ్గర గంజాయి లభించింది. దానిని స్వాధీనం చేసుకుని, యువకులను అదుపులోకి తీసుకున్నారు. ఆదివారం తెనాలి న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా, 14 రోజులపాటు రిమాండ్ విధించారు. దీనితో వారిని నర సరావుపేట సబ్‌జైలుకు తరలించారు.

ఎరుకుల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



దుగ్గిరాల: మండల కేంద్రంలోని ఏకలవ్య విగ్రహ ఆరో వార్షికోత్సవాన్ని ఎరుకల సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేవరకొండ శంకరరావు మాట్లాడుతూ ఎరుకుల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. ఎరుకుల, గిరిజనులకు ఆర్థిక ఆసరా, వ్యాపారాభివృద్ధికి తోడ్పాటును రాష్ట్ర ప్రభుత్వం అందించాలని కోరారు. పీఏ సీఎస్ మాజీ చైర్మన్ వెనిగళ్ల శ్రీకృష్ణప్రసాద్, సేవా సంఘం మండలాధ్యక్షుడు గరిక శ్రీనివాసరావు, మహిళలు పాల్గొన్నారు. తొలుత ఏకలవ్య విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు.

బర్డ్ ఫ్లూ ఎఫెక్ట్..

- నగానికి నగం పడిపోయిన చికెన్, గుడ్ల విక్రయాలు
- నేల చూపులు చూస్తున్న ధరలు
- ఆదివారం కూడా దూరం పెట్టిన ప్రజలు
- డీలాపడ్డ చికెన్ వ్యాపారులు



వ్యాపారం లేక వెలవెలబోతున్న మంగళగిరి పట్టణంలోకి చికెన్ దుకాణం

మంగళగిరి: బర్డ్‌ఫ్లూ ప్రభావం చికెన్ వ్యాపారం మీద పూర్తి ప్రభావం చూపింది. చికెన్‌తో పాటు కోడిగుడ్ల విక్రయాలూ చాలా వరకు పడిపోయాయి. మంగళగిరి పట్టణంలో బర్డ్ ఫ్లూ లేనప్పుడు గుడ్డు ధర రూ.7కి చేరింది. కేజీ చికెన్ రూ.225కు పైనా విక్రయించారు. నేడు అదే గుడ్డు ధర రూ.4కి పడిపోయింది. చికెన్ కేజీ రూ.160, అంతకు తక్కువగానే విక్రయిస్తున్నారు. రూ.30 గుడ్లు ఉండే ట్రే పాంతాలను బట్టి రూ.135 నుంచి రూ.150 వరకు విక్రయిస్తున్నారు. ఆదివారం జోరుగా సాగాల్సిన చెకెన్ వ్యాపారం నగానికి నగం పడిపోయింది.

పడిపోయిన చికెన్ విక్రయాలు..

మంగళగిరి పరిధిలో మొత్తం నాలుగు పౌల్ట్రీలున్నాయి. ఇక్కడి నుంచి దుకాణాలకు సాధారణంగా రోజుకు 4 వేల కేజీల చికెన్(లైవ్) సరఫరా అవుతుంది. ఆదివారం 7 వేల కేజీల వ్యాపారం జరుగుతుంది. అయితే.. బర్డ్ ఫ్లూ భయంతో ఆదివారం చికెన్ వ్యాపారం 3వేల కేజీలకు పడిపోయింది. ఇక మిగిలిన రోజుల్లో 1,200 కేజీలకే చికెన్ సరఫరా పరిమితమైంది. వినియోగదారుల్లోనూ భయం ఏర్పడటంతో..చికెన్‌కు దూరంగా ఉంటున్నారు.

గుడ్ల విక్రయాలపై తీవ్ర ప్రభావం

ముఖ్యంగా నగర పరిధిలో సుమారు 8 లక్షల కోడిగుడ్ల అమ్మకాలు ప్రతి రోజూ జరుగుతుంటాయని, బర్డ్ ఫ్లూ భయంతో విక్రయాలు క్షీణించాయని వ్యాపారులు వాపోతున్నారు.



గుడ్ల దుకాణం

జోరుగా మటన్, చేపల వ్యాపారం

తాడికొండ: నియోజకవర్గంలో గత వారం కేజీ చికెన్ రూ.200 ధర ఉండగా ఈ వారం రూ.40 తగ్గించి రూ.160కి అమ్మకాలు చేసినప్పటికీ ప్రజలు ఆసక్తి చూపలేదు. కొనుగోలుదారులు రాకపోవడంతో చికెన్ దుకాణ దారులు ఖాళీగా కూర్చోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. బర్డ్ ఫ్లూ ఎఫెక్ట్‌తో ప్రజలు మటన్, సీఫుడ్స్ వైపు మళ్లారు. మటన్ దుకాణాల ఎదుట జనం బారులు తీరి కనిపించారు. ప్రతి వారం 5 జీవాల మాంసం విక్రయించే దుకాణాలు కూడా ఆదివారం మాత్రం 15 జీవాల మాసం అమ్మినా జనం ఎగబడుతుండటంతో విక్రయదారులు చేతులెత్తేశారు. చేపలు, రొయ్యల కొనుగోళ్లకు ఆసక్తి చూపడంతో ఉదయం 9 గంటలకే సరుకు అమ్ముకొని వ్యాపారులు ఇంటిబాట పట్టారు. బర్డ్ ఫ్లూ ప్రభావం తగ్గి, జనంలో చికెన్‌పై సానుకూల దృక్పథం వచ్చే వరకు చికెన్ కొనుగోళ్లపై ఈ ప్రతికూల పరిస్థితి ఉంటుందని అమ్మకం దారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి



బర్డ్ ఫ్లూ ఉన్న ప్రాంతాల్లో మినహా.. గుడ్డును తినవచ్చు. కానీ ఆరోగ్యం కోసం పచ్చి గుడ్లను వాడేవారు కొన్నాళ్లు దూరం పెట్టాలి. బర్డ్ ఫ్లూ ప్రభావం తగ్గే వరకు కొన్ని జాగ్రత్తలతో గుడ్లు, చికెన్ తింటే ఆరోగ్యానికి మంచిది. సగం ఉడికించిన(ఆఫ్ బాయిల్డ్), సరిగా ఉడకని ఆమ్లెట్ తినకూడదు.

– డాక్టర్ గీతా పద్మజ, ప్రభుత్వాసుపత్రి

కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలకు

మంగళగిరి టౌన్ : చిన్నతనం నుంచి కష్టపడి చదివినప్పుడే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను చేరుకుంటారని ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్‌ఫ్రా స్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. మంగళగిరి నగర పరిధిలోని వీజేపీ అండ్ డీఎల్‌బీ డిగ్రీ కళాశాల ఫంక్షన్ హాల్‌లో నిర్మల జూనియర్ కాలేజీ విద్యార్థుల ఫేర్‌వెల్ పార్టీ ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చిల్లపల్లి మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని నిరంతరం సాధన చేయాలని పేర్కొన్నారు. సెల్ ఫోన్‌తో సమయం వృథా చేసుకోవద్దని హితవు పలికారు. ఈ విద్యా సంవత్సరంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన టాపర్లకు, క్రీడల్లో రాణించిన క్రీడాకారులకు జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, మాజీ కౌన్సిలర్ వీవీ జవహర్‌లాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు జ్ఞాపికలు అందజేస్తున్న చిల్లపల్లి

క్షమాపణతోనే పాపాల ప్రక్షాళన

ఫిరంగిపురం: క్షమాపణతోనే పాపాల ప్రక్షాళన జరుగుతుందని విచారణ గురువు ఎం.ఫాతిమా మర్రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని బాలఏసు దేవాలయంలో ఆదివారం విశ్వాస దివ్య పూజాబలి నిర్వహించారు. ఈ సందర్భంగా ఫాతిమా మర్రెడ్డి వాక్యోపదేశం చేస్తూ ప్రతి వ్యక్తి మానవుడిపై విశ్వాసం ఉంచే కన్నా దేవుడిపై విశ్వాసం ఉంచాలన్నారు. దాని ద్వారా తమ కష్టాలు, బాధలు తీరుతాయని చెప్పారు. అలా కాకుండా దేవుడిపై విశ్వాసాన్ని విడనాడి మానవుడిని విశ్వసించడం ద్వారా ఇబ్బందులు పడుతాడన్నారు. భగవంతుడిని మర్చిపోకుండా ఆయనపై ఆధారపడి జీవితాన్ని కొనసాగించాలని తెలిపారు. నిత్య జీవితంలో తాను చేస్తున్న పాపాలను భగవంతుడికి తెలిపి ప్రార్థించడం ద్వారా ప్రక్షాళన పొందవచ్చని చెప్పారు. అనంతరం దివ్య పూజాబలి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సహాయ విచారణ గురువులు బి.ప్రవీణ్‌కుమార్, మఠకన్య స్త్రీలు, కథోళిక క్రైస్తవులు పాల్గొన్నారు.



దివ్యపూజాబలి నిర్వహిస్తున్న విచారణ గురువు ఫాతిమా మర్రెడ్డి

కేఎస్ లక్ష్మణరావు తరపున ప్రచారం

తాడేపల్లిరూరల్ : కృష్ణ, గుంటూరు ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావును గెలిపించాలని కోరుతూ తాడేపల్లి రూరల్‌పరిధిలోని వడ్డేశ్వరం గ్రామంలో ఆదివారం కరపత్రాల పంపిణీ కార్యక్రమాన్ని వ్యవసాయ కార్మిక సంఘం, ప్రజా సంఘాల నాయకులు చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, అవుట్ సోర్సింగ్ కార్మికులు అన్ని వర్గాల ప్రజల సమస్యల పరిష్కారం కొరకు లక్ష్మణరావుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే తాడేపల్లి పరిధిలోని ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ, ఉండవల్లి పట్టణంలోని వివిధ అపార్ట్‌మెంట్లలో లక్ష్మణరావుకు మద్దతుగా ప్రజా సంఘాల నాయకులు ప్రచారం నిర్వహించారు. శాసన మండలిలో ప్రజల పక్షాన తన వాణిని లక్ష్మణరావు వినిపిస్తారని అన్నారు. ఈ కార్యక్రమాల్లో ఏపీ కౌలు రైతు సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ, రైతు నాయకులు గుంపెన వెంకటేశ్వరరావు, సీఐటీయూ నాయకులు ఎస్కే గన్, డివైఎఫ్ నాయకులు పాల్గొన్నారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న పాశం రామారావు తదితరులు

ఆంధ్రభోజుడు శ్రీకృష్ణదేవరాయలు

ఈమని(దుగ్గిరాల): దుగ్గిరాల మండలంలోని ఈమని గ్రామంలో ఆదివారం విజయనగర సామ్రాజ్య చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయలు 554వ జయంతిని నిర్వహించారు. గ్రామ కాపుసంఘం ఆధ్వర్యంలో అక్కడి రామమందిరంలో ఏర్పాటైన సభకు కవి, రచయిత రంగిశెట్టి రమేష్ (గంగాశ్రీ) అధ్యక్షత వహించారు. విజయనగర సామ్రాజ్యాన్ని రాజుగా చిన్నవయసులోనే బాధ్యతలు స్వీకరించిన శ్రీకృష్ణదేవరాయలు గొప్ప పరిపాలనాదక్షుడిగా పేరుగాంచినట్టు గుర్తుచేశారు. రాయల పాలనలో విజయనగర సామ్రాజ్యం అత్యున్నతస్థితికి చేరుకుందిన తెలిపారు. జనరంజకంగా పరిపాలన చేయటమే కాకుండా కవులు, కళాకారులను పోషించి 'ఆంధ్రభోజుడు'గా కీర్తిని పొందారనీ చెప్పారు. రాయలు కూడా కవిగా చెబుతూ సాహితీ సమరాంగణ సార్వభౌముడుగా ఖ్యాతిని వహించినట్టు వివరించారు. విశ్రాంత ఉపాధ్యాయుడు ఎస్ఆర్‌కె రమేష్ మాట్లాడుతూ రాయలు జీవితవిశేషాలను తెలియజేశారు. రాయల ఆస్థానకవుల్లో ఒకరై ప్రఖ్యాతిగాంచిన తెనాలి రామకృష్ణకవి తెనాలికి చెందినవారేనని గుర్తుచేశారు. విద్యార్థులు, నేటి తరం యువతీయువకులు రాయల చరిత్రను తెలుసుకోవాలని అభిప్రాయపడ్డారు. కవి చందు సూర్య రాయల జీవితవిశేషాలతో కవితాగానం చేశారు. సభానంతరం పేదలకు నిత్యావసరాలు, కూరగాయలు, పిల్లలకు నోట్‌పుస్తకం, పెన్ను, పెన్సిళ్లను బహూకరించారు. కుప్పాల శ్రీరామమూర్తి పర్యవేక్షించారు. అంబటి వెంకటేశ్వర్లు, యడ్ల సాయికృష్ణ, పసుపులేటి శ్రీనివాసరావు, పసుపులేటి శివకోటి, బొందలపాటి పూర్ణయ్య, మద్దిరాల రోశయ్య, చెన్నంశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.




పిల్లలకు పుస్తకాలు, పెన్నుల పంపిణీ

75వ రోజుకు కార్మికుల దీక్ష



తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందరం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు ఆదివారం 75వ రోజుకు చేరుకున్నాయి. దీక్షా శిబిరాన్ని సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు, యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిమెంట్ ఫ్యాక్టరీ అక్రమ లాకౌట్ ప్రకటించి 33 సంవత్సరాలు అయ్యిందని తెలిపారు. కార్మికులు న్యాయంగా తమకు రావాల్సిన బకాయిలను చెల్లించాలని కోరుతూ రిలే నిరాహార దీక్షలు చేపట్టి 75 రోజులు పూర్తిచేసుకున్నట్లు వెల్లడించారు. ఇప్పటికీ ప్రభుత్వం కార్మికుల సమస్యను పరిష్కరించకపోవడం విచారకరమన్నారు. ఎన్నికల ముందు నారా లోకేష్ కార్మికుల సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని, ఇప్పుడు ఆ హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డి.రమణ, బి.నవనీతం, బి.అంకయ్య, ఎం.ఆశీర్వాదం, ఖాసిం, జి.వెంకటేశ్వర్లు, దుర్గా భవాని, రిబ్కా, రాణి, రమాదేవి పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



తాడికొండ: తుళ్లూరు హెచ్ఎస్ఆర్ కల్యాణ మండలంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. బండ్ల చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శ్రేష్ఠ ఆసుపత్రి సౌజన్యంతో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో 143 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించగా వీరిలో 78 మందికి ఈసీజీ, 74 మందికి బోన్ మ్యారో పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ట్రస్టు చైర్మన్ బండ్ల పట్టాభిరామయ్య మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయడంలో తమ ట్రస్టు ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అమరావతి జేఏసీ కన్వీనర్ పువ్వాడ సుధాకర్, టీడీపీ నాయకులు బండ్ల కోటేశ్వరరావు, కాటా అప్పారావు, గడ్డం వెంకటేశ్వరరావు, బండ్ల శ్రీనివాసరావు, జమ్ముల అనీల్, కొమ్మినేని సత్యన్నారాయణ, జొన్నల గడ్డ శంకరి, మూల్పూరి రాంబాబు, వైద్య బృందం సభ్యులు పాల్గొన్నారు.

చిలువూరులో స్వచ్ఛాంధ్ర



దుగ్గిరాల: మండలంలోని చిలువూరు గ్రామంలో మండల అధికారులు స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివాస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామంలో పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు, సబ్బులు, చేతి గ్లౌజులు పంపిణీ చేశారు. అనంతరం మొక్కలు నాటారు. గ్రామ కూడలిలో మానవ హారం నిర్వహించి నినాదాలు చేశారు. స్వచ్ఛాంధ్ర కోసం ప్రతిజ్ఞ చేశారు. ఇంటింటికి తిరిగి తడి-పొడి-హానికర చెత్త సేకరణ గురించి అవగాహన కల్పించారు. ఎంపీడీవో ఎ.శ్రీనివాసరావు, తహసీల్దార్ ఐ.సునీత, ఈవోపీఆర్డీ కె.జవహర్‌లాల్ నెహ్రూ, ఎంఈఓ కాజా శ్రీనివాసరావు పాల్గొన్నారు. - కంఠంరాజు కొండూరు గ్రామంలో గ్రామ కార్యదర్శి ఆర్.కిషోర్‌కుమార్ కూడలిలో మానవహారం నిర్వహించారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకునే విధంగా ప్రతిజ్ఞ చేశారు. దుగ్గిరాలలోని డాక్టర్ కేఆర్‌ఎం కళాశాల ఆవరణ శుభ్రం చేశారు. ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పరిశుభ్రత గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ టి.రాఘవరెడ్డి, ఎన్ఎస్ఎస్ అధికారి డి.రాంబాబు, అధ్యాపకులు వై.పూర్ణచంద్రరావు, కె.సరళాదేవి పాల్గొన్నారు.

పోలీసు విధులపై మహిళలకు అవగాహన

తాడేపల్లిరూరల్ : తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో నులకపేట, చుట్టు పక్కల ప్రాంతాల్లో ఆదివారం సాయంత్రం తాడేపల్లి సీఐ కల్యాణ్‌రాజు తన సిబ్బందితో పర్యటించారు. విజువల్ పోలీసింగ్, ఇతర అంశాలపై మహిళలకు, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రతి రోజు చుట్టూనే అనేక అసాంఘిక ఘటనలు జరుగుతాయని కానీ, ఎవరూ పోలీసులకు సమాచారం ఇవ్వరన్నారు. ఇందుకు పోలీసులంటే ప్రజల్లో ఒక రకమైన భయం కారణమన్నారు. కానీ, పోలీసులకు సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతారని, అలాంటి భయాలు ఎవరూ పెట్టుకోవద్దని ధైర్యం చెప్పారు. మన చుట్టుపక్కల గంజాయి అమ్మకాలు జరిగితే మన కెందుకులే అనుకుంటామని, అది రేపు మన కుటుంబ సభ్యులకు కూడా అలవాటయ్యే ప్రమాదం ఉందన్నారు. గత వారం రోజుల్లో నులకపేట పరిసర ప్రాంతాల నుంచి మద్యం సేవిస్తున్న వారిపై ఇచ్చిన సమాచారం మేరకు అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇప్పుడు ప్రజలు ఎలా సమాచారం ఇస్తున్నారో ముందు కూడా ఇలా సమాచారం ఇవ్వాలని కోరారు. నులకపేటలోని బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న వారికి తమదైన శైలిలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు కోటయ్య, ఖాజావలి, సిబ్బంది పాల్గొన్నారు.



మహిళలకు పోలీసుల విధులపై అవగాహన కల్పిస్తున్న సీఐ కల్యాణ్ రాజు

హార్మోన్ల సమతుల్యతపై అవగాహన

తాడేపల్లిరూరల్: ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్శిటీ ఫార్మసీ, ఏఐ, డీఎస్ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో దుగ్గిరాల మండల పరిధిలోని శృంగారపురం గ్రామంలో మహిళల్లో హార్మోన్ల సమతుల్యతపై అవగాహన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. యూనివర్శిటీ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్.సుప్రియ మాట్లాడుతూ.. మహిళలలో హార్మోన్లు అసమతుల్యంగా ఉండడం వల్ల అనారోగ్య సమస్యలకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. జీవన శైలిలో మార్పులు చేసుకోవడం ద్వారా ఈ సమస్యను అధిగమించవచ్చని వివరించారు. హార్మోన్ల సమస్య వల్ల అండాశయంలో మార్పులు చోటుచేసుకుని రుతుక్రమం అసాధారణంగా మారుతుందని, కొంతమంది మహిళలల్లో హైడ్రోజన్ హార్మోన్లు ఉత్పత్తి అవడం వల్ల అండోత్పత్తి ప్రభావితం అవుతుందన్నారు. తద్వారా గర్భధారణ సమస్యలు ఉత్పన్నమవుతాయని వివరించారు. ఫార్మసీ వాలంటీర్లు ఇంటింటికి తిరిగి అవగాహన కల్పిస్తూ ఒకే సమయానికి ఆహారం తీసుకోవడం, నిద్రపోవడం, భావోద్వేగాలను అదుపులో ఉంచుకోవడం, యోగా, మెడిటేషన్ వంటి వాటి ద్వారా మానసిక ఒత్తిడి, ఆందోళనలకు దూరం చేసుకోవడం ద్వారా హార్మోన్ సమస్యలను అధిగమించవచ్చని వివరించారు. ఈ కార్యక్రమానికి సమన్వయకర్తగా వ్యవహరించిన పి.సురేష్, వలంటీర్లను యూనివర్శిటీ ఇన్‌చార్జి వీసీ డాక్టర్ కె.రాజశేఖరరావు, ప్రో వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్రామ్, ప్రిన్సిపల్ డాక్టర్ చక్రవర్తి, డీన్‌లు డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్, డాక్టర్ హబీబుల్లా ఖాన్, హెచ్ఓడీ డాక్టర్ బి.తిరుపతిరెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ పి. శ్రీకాంత్ రెడ్డి అభినందించారు.



అవగాహన కల్పిస్తున్న ఫార్మసీ కళాశాల విద్యార్థినులు

శిశుస్తన్య పాన ప్రాంగణం ప్రారంభం

మంగళగిరి టౌన్: మంగళగిరి నగరంలో వేంచేసిన లక్ష్మీ నరసింహస్వామి దేవస్థనం ప్రాంగణంలో రోటరీ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 3150 గవర్నర్ కె.శరత్ చౌదరి ఆదివారం శిశుస్తన్యపాన ప్రాంగణం ప్రారంభించారు. శరత్ చౌదరి దంపతులు స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత మంగళగిరి ఆలయ ఈవో అన్నపురెడ్డి రామకోటిరెడ్డి, మంగళగిరి రోటరీ క్లబ్ ప్రతినిధులు ఆలయ మర్యాదలతో స్వాగతించారు. స్వామి వారి దర్శనం అనంతరం దేవస్థానం ప్రాంగణంలో మంగళగిరి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిశుస్తన్య పాన ప్రాంగణాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళగిరి రోటరీ క్లబ్ రెండు గొప్ప ప్రాజెక్టులు చేపట్టడంపై సంతోషం వ్యక్తం చేశారు. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రం మహిళలకు ఎంతో ఉపయుక్తమని అన్నారు. ఆలయానికి వచ్చిన మహిళలు తమ శిశువుకు పాలను అందించేందుకు ఉపయోగపడుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు 10వ తరగతి తర్వాత కెరీర్ గైడెన్స్ పుస్తకాలు, పోస్టర్లు అందిస్తున్నారని, ఈ రెండు ప్రాజెక్టులు మంగళగిరి రోటరీ క్లబ్ చేపట్టడం గొప్ప విషయమన్నారు. చినకాకాని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కెరీర్ గైడెన్స్ చార్టును ఆయన ఆవిష్కరించారు. విద్యార్థులకు తగు సూచనలు అందించారు. ఏ కోర్సులు చేయాలనే పూర్తి వివరాలను అందుబాటులో ఉండేలా మంగళగిరి రోటరీ క్లబ్ చార్టును ప్రశంసించారు. నియోజకవర్గ పరిధిలోని 13 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఈ చార్టులను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. చార్టర్ ప్రెసిడెంట్ అనిల్ చక్రవర్తి, మంగళగిరి రోటరీ క్లబ్ అధ్యక్షుడు గాజుల శ్రీనివాసరావు, కార్యదర్శి అందె మురళీమోహనరావు, కోశాధికారి శ్రీనివాసరావు, డిప్యూటీ గవర్నర్ పాటిబండ్ల శివరంజని, అసిస్టెంట్ గవర్నర్ డాక్టర్ మాజేటి వంశీకృష్ణ సభ్యులు పాల్గొన్నారు.



శిశుస్తన్య పాన ప్రాంగణాన్ని ప్రారంభిస్తున్న శరత్ చౌదరి దంపతులు

ప్రతి పల్లెలో వైఎస్సార్ సీపీ జెండా ఎగుర వేయాలి

పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు

మేడికొండూరు : ప్రతి పల్లెల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేయాలని తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాలవజ్ర బాబు అన్నారు. ఆదివారం మండలంలోని పేరేచర్ల గ్రామంలో నాయకుల కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనానికి ఆయన హాజరయ్యారు. మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను నిండా ముంచిందని విమర్శించారు. వైఎస్సార్ సీపీకి కార్యకర్తలు, నాయకులే పునాదులు అన్నారు. వారి కష్టం ఎప్పటికీ వృథా కాదన్నారు. త్వరలో పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా అర్హులకు పదవులు కేటాయింపులు జరుగనున్నాయన్నారు. ఇందులో పార్టీ కోసం పనిచేసిన వారందరికి ఆమోదంతో గ్రామ, మండల, జిల్లా స్థాయి పదవులు ఇవ్వనున్నట్లు తెలిపారు. పార్టీ కోసం పనిచేసిన ప్రతి కార్యకర్తకు మంచి భవిష్యత్తు ఉంటుందని ప్రతి ఒక్కరు కష్టసుఖాల్లో తాను నీడగా ఉంటానని భరోసా ఇచ్చారు. పార్టీని మరింత పటిష్టం చేసేందుకు కమిటీల నియామకంతో త్వరలో అందరూ ఆమోదంతో జరుగనుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల జెడ్పీటీసీ కందుల సిద్దయ్య, పార్టీ మండలాధ్యక్షుడు తాళ్లూరు వంశీకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి మస్తాన్‌వలి, ముత్యాల బాలస్వామి, గండికోట రసూలు, షేక్ అబ్దుల్లా రస్ హుస్సేన్, సుభాని పల్లపు శీను, పలు గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



కార్యకర్తలతో మాట్లాడుతున్న వనమా బాల వజ్రబాబు

రామసాయి జ్ఞానమందిర వార్షికోత్సవాలు

తెనాలిటౌన్: కొలకలూరు గ్రామంలోని రామసాయి జ్ఞాన మందిరం వార్షికోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం స్వామికి రాజ్యలక్ష్మి భజన సమాజం ఆధ్వర్యంలో విష్ణు సహస్ర నామ పారాయణం నిర్వహించారు. అనంతరం బాబాకు 108 కలశాలతో కలశాభిషేకం చేశారు. పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని బాబాకు పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీరామసాయి ట్రస్ట్- శ్రీరామసాయి జ్ఞాన మందిరం కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

